క్లుప్తంగా

అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక, స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈఓపీఆర్డీ శారదాదేవి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో 2030 సంవత్సరంలోపు మౌలిక సదుపాయాల రూపకల్పనకు 9 రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పేదరికం లేని గ్రామం, పరిశుభ్రం, హరిత గ్రామం లక్ష్యాలే ధ్యేయంగా గ్రామ పంచాయతీలో అభివృద్ధి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, ఏపీఎం మీరా బాయి, సీహెచ్‌ఓ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేతపై ఫిర్యాదు

పలమనేరు: మండలంలోని చిన్నపేటకురపల్లిలో మూడు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ధ్వంసం చేసి అక్కడున్న చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత హెచ్‌ఎం విజయకుమారి ద్వారా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసినట్టు ఎంఈఓ లీలారాణి తెలిపారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలకు జరిగిన నష్టాన్ని ఇప్పించాలని పోలీసులకు తెలిపామన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ రామమ్మ మృతి



రామమ్మ (ఫైల్)

పుంగనూరు: అనారోగ్యంతో పుంగనూరు రిటైర్డ్ ఎంపీడీఓ రామమ్మ(65) బుధవారం మృతిచెందారు. ఈమె అంత్యక్రియలు నేడు స్వగ్రామమైన శ్రీకాళహస్తి సమీపం చుక్కలనిడిగల్లులో నిర్వహించనున్నారు. రామమ్మ గత 35 సంవత్సరాల క్రితం పుంగనూరులోనే ఉంటూ టైపిస్ట్‌గా విధుల్లో చేరి ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. ఈమె మరణవార్త తెలియగానే ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటరెడ్డి యాదవ్, నరసింహులు, మాజీ జెడ్పీటీసీ వేమన్న సహా పలువురు నేతలు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు.

ప్రపంచ మహాసభలకు తులసీనాథంనాయుడు



తులసీనాథంనాయుడు

పలమనేరు: ఈనెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరగనున్న ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడికి ఆహ్వానం అందినట్టు బుధవారం ఆయన తెలిపారు. ఈనెల 29న జరిగే భాషోద్యమ సదస్సులో తెలుగుభాష పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై ప్రసంగించనున్నట్టు అందులో పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం



బస్‌షెల్టర్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

చౌడేపల్లె: చారాల ఉన్నత పాఠశాలలో 1987–88లో చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రయాణికులు, విద్యార్థులకు సౌకర్యార్థం బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పలమనేరు వైపు వెళ్లే ప్రయాణికులకు, పిల్లలకు సౌకర్యంగా ఉండేలా పాఠశాల ముందు రోడ్డుపక్కన ఏర్పాటు చేస్తున్నారు. రూ.2 లక్షల నిధులు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముద్దప్ప, జనార్దన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ బీవీ రెడ్డి

బంగారుపాళెం: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం వైపు అడుగులు వేయగలరని సైకాలజిస్ట్ డాక్టర్ బీవీ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బ్లెస్ ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళనకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రతనాల రాగి

- నీటి వసతి లేని రైతులకు సౌకర్యమైన పంట
- ఎంతకాలమైనా నిల్వ
- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- ప్రస్తుతం జిల్లాలో 600 ఎకరాల్లో మాత్రమే సాగు



కుప్పంలో ఏపుగా పెరిగిన రాగి

పలమనేరు: నీటి సౌకర్యం తక్కువగా ఉండి, పెట్టుబడులు పెట్టి సేద్యం చేయలేని రైతులకు రాగి పంట కల్పతరువుగా మారింది. తక్కువ పెట్టుబడితో అధికలాభాలు పొందే అవకాశం ఉండడంతో జిల్లాలోని పడమటి మండలాల రైతులు ఈ రబీ సీజన్‌లో నీటి ఆధారిత పంటగా రాగిని సాగు చేసేందుకు మంచి సమయం. జిల్లాలో సాధారణ రాగి పంట సాగు 1,760 ఎకరాలు కాగా ఇప్పుడు 600 ఎకరాల్లో మాత్రమే సాగైంది. దీన్ని మరింతగా పెంచేందుకు వ్యవసాయ, డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏలు కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిరుధాన్యాల్లో రాగి రాజసం

శాస్త్రీయంగా ఫింగర్ మిల్లెట్ అని పిలువబడే ఈ పంట పొరుగునే ఉన్న కర్ణాటకలో ఎక్కువగా సాగవుతోంది. జిల్లాలోని పలమనేరు, కుప్పం, పుంగనూరులలో ప్రస్తుతం రాగిని సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో ఆరు తడైతే ఐదు నుంచి ఆరు క్వింటాళ్లు, నీటి వసతి ఉంటే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం క్వింటాళ్ రాగి ధర రూ.10వేలుగా ఉంది. ఆ లెక్కన నీటి వసతితో పంట చేస్తే రూ.80 వేల దాకా ఆర్జించవచ్చు. ఎకరాకు పంట పెట్టుబడి కేవలం రూ.10వేలు మాత్రమే. దీంతో రూ.70వేల దాకా రైతుకు మిగిలినట్టే. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది.

చిరుధాన్యాల పెంపునకు ప్రభుత్వ కృషి ఎక్కడ..?

జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా జిల్లా మహిళా సమాఖ్యతో సమావేశాన్ని నిర్వహించింది. రాగి పంటసాగుతో కలిగే లాభాలను వివరించి పంటసాగుకు పలు ప్రోత్సాహాలనిచ్చింది. జిల్లాలో రాగి సాగును 15వేల ఎకరాలకు పెంచేలా లక్ష్యంగా నిర్ణయించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుధాన్యాలపై ప్రోత్సాహం కరువైంది. రాయితీలు కొండెక్కాయి.

కోవిడ్‌తో రాగిపై మక్కువ...

ఆహారంలో లోపించే మిథియోనైన్ అనే యాసిడ్ రాగిలో ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు తగ్గడానికి, మధుమేహ నియంత్రణకు, ఎముకల పుష్టికి, స్థూలకాయ నివారణకు, రక్తహీనత మెరుగుకు, కండరాల బలోపేతానికి ఇదెంతగానో ఉపకరిస్తుంది. దీంతో పాటు ఆందోళనలు తగ్గించడమే కాకుండా త్వరగా వృద్ధాప్యం రాకుండా చేసే గుణం రాగికి ఉంది. అందుకే ప్రస్తుతం రాగి ముద్దతో పాటు రాగిదోసె, ఇడ్లీ, మురుకులు ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి. పెద్ద ఫైవ్‌స్టార్ హోటళ్ల నుంచి చిన్నపాటి దాబాల్లోనూ ప్రస్తుతం రాగిముద్ద తినడం ప్రజలకు ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది.



కుప్పంలో రాగి పంటపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

లాభాల పంట రాగి..



రకరకాల పంటలను సాగు చేసి భారీ పెట్టుబడులు పెట్టి నష్టాలు తెచ్చుకొనే బదులు తక్కువ ఖర్చుతో లాభం వచ్చే రాగి ఇప్పుడు రైతులకు మేలుగా మారింది. చీడపీడల బాధ లేకుండా కూలీల ఖర్చులేకుండా సులభంగా పండే పంట ఇది. నేనూ ఈ దఫా రాగిని సాగుచేస్తున్నా. చిన్న, సన్నకారు రైతులకు సైతం చాలా సులువైన పంట రాగి. –చందూల్‌రెడ్డి, సేంద్రియ రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

రాగి సాగును ప్రోత్సహిస్తున్నాం..



రాగిపంట సాగును పెంచేందుకు అన్ని రకాలుగా కృషిచేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని మహిళా సమాఖ్య ద్వారా గ్రూపు మహిళలు రాగిని సాగు చేసేలా అవగాహన కల్పించాం. ఈ దఫా 15వేల ఎకరాల్లో రాగి సాగుచేసే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. ఈ రబీలో నీటి ఆధారంగా పంట సాగును పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. –మురళీకృష్ణ, డిస్ట్రిక్ అగ్రికల్చర్ ఆఫీసర్, చిత్తూరు

సర్వే రాళ్ల పరిశీలన



సర్వే రాళ్ల పరిశీలనకు వెళ్తున్న విద్యాధరి

చౌడేపల్లె: మండలంలోని తవళం అటవీ బీటు ప్రాంతంలోగల అటవీ, రెవెన్యూ స్థలం సరిహద్దు సర్వే రాళ్లను బుధవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించారు. అటవీ సమీపంలోగల రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సాగు చేసిన పంటలు, పంటల రక్షణ అంశాలపై ఆరా తీశారు. జిల్లా అటవీశాఖాధికారి ఎస్ భరణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్‌లు, అధికారులు

రొంపిచెర్ల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా అడుగులు వేయాలని ఈఓఆర్డీ సత్యంరెడ్డి అన్నారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన 17 లక్ష్యాలను, 9 అంశాలపై ఆయా శాఖల అధికారులకు శిక్షణ ఇచ్చారు. మా విధులకు న్యాయం చేస్తామని అందరితో ప్రమాణం చేయించారు. ఏఓ రెడ్డెప్పఆచ్చారి, సీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, సీహెచ్‌ఓ కాంతమ్మ, ఫయాజ్, వేణుగోపాల్, హరినాథ్ శిక్షణ ఇచ్చారు.

పంట నమోదు చేసుకోండి



టి.వడ్డూరు వద్ద ఉలవ పంటను పరిశీలిస్తున్న డీఏఓ

పలమనేరు: ప్రభుత్వ లబ్ధి పొందాలంటే రైతులు విధిగా పంట నమోదు చేసుకోవాల్సిందేనని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఆమేరకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులతో కలసి ఆయన మండలంలోని టి.వడ్డూరు, పెంగరగుంట, మొసలిమడుగు గ్రామాల్లో సాగవుతున్న పంటలను బుధవారం పరిశీలించారు. టి.వడ్డూరులో ఆయన మాట్లాడుతూ ఏ పంట సాగుచేసినా తప్పకుండా ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ చేసుకోవాలన్నారు. దీంతో పంటల బీమా, రైతు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నా, సున్నా వడ్డీ పొందాలన్నా వీలుంటుందన్నారు. ఏఓలు సంధ్య, యామిని, విస్తరణ అధికారి కుమార్ నాయుడు, రైతుసేవా సిబ్బంది గగన సింధు, భారతి, రైతులు పాల్గొన్నారు.

నేడు కౌలుకు భూముల వేలం

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో నేటి ఉదయం 9 గంటలకు ఆలయానికి చెందిన భూముల మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ కమలాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే వారు రూ.10వేల డిపాజిట్‌ను ముందుగా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. గంగవరం, పలమనేరు పట్టణానికి చెందిన నాలుగు సర్వే నంబర్లలోని భూములను వేలంలో పెట్టినట్టు తెలిపారు.

అందుబాటులో మామిడి కవర్లు



మామిడి కవర్లు చూపుతున్న వరప్రసాద్

గంగవరం: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి పండ్ల కవర్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆశించిన స్థాయిలో మంచి సైజుతో కాయ దిగుబడి, నాణ్యత రావాలంటే మామిడి పళ్లకు కవర్లు కట్టడం ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. ఈ ఏడాది కూడా ఉద్యానశాఖ ద్వారా రైతులకు మామిడి కవర్లు అందజేస్తామన్నారు. అందుకోసం ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు ఇచ్చి కవర్ల కోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక్కో కవర్ ధర రూ.1తో రైతులకు అందజేస్తామని, వివరాల కోసం ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుంగనూరు: పట్టణంలోని సబ్‌స్టేషన్లలో మరమ్మతులు జరుగుతున్న కారణంగా పట్టణ ప్రజలకు రెండు రోజులు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా మదనపల్లె నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. దీని కారణంగా కొంత మేరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



పెద్దపంజాణి: అర్జీలు తీసుకుంటున్న అధికారులు



చౌడేపల్లెలో రెవెన్యూ సదస్సు

గుడుపల్లె: రెవెన్యూ సమస్యల పరిష్కారమే సదస్సుల లక్ష్యమని తహసీల్దార్ శీతారాం అన్నారు. బుధవారం మండలంలోని యామగానిపల్లెలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సులో రెవెన్యూకు సంబంధించి 48 అర్జీలు వచ్చాయన్నారు. మండల సర్వేయర్ రత్నప్ప, నేతలు టీఎం బాబునాయుడు, శ్రీనివాసులు, అరుణాచలం పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ డీటీ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం కొళత్తూరు పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 32 అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు. మండల సర్వేయర్ సాయిరాజ్, ఆర్ఐ రాకేష్, వీఆర్వో శంకరప్ప పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని కొండామర్రి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 23 అర్జీలు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవి తెలిపారు. ఆర్ఐ భారతి, సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నేతలు

పుంగనూరు: జనవరి 5న హైందవ శంఖారావం విజయవాడలో నిర్వహిస్తున్నట్లు ఈ సభకు లక్షలాది మంది హిందువులు తరలిరావాలని హిందూజాగరణ సమితి ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు కాషాయ కండువాలు వేసుకుని మానవహారం నిర్వహించారు. బలిజ సంఘ అధ్యక్షుడు నాన బాలమణి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, క్షత్రియ సంఘ అధ్యక్షుడు భక్తవత్సలరాజు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు వెంకటపతి, రెడ్డెప్పరెడ్డి, బీజేపీ నాయకులు నానబాలకుమార్, మఠంబాబు, డాక్టర్ల సంఘ నాయకుడు డాక్టర్ శరణ్, రిటైర్డ్ మిలటరీ సంఘ నేతలు నాన బాలగణేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు ఇంజినీరింగ్ విద్యార్థిని



ఎంపికైన విద్యార్థినితో యాజమాన్యం

కుప్పంరూరల్: ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ వాలీబాల్ పోటీలకు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని దివ్యశ్రీ ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ తెలిపారు. కావలి సుబ్రమణ్యంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఎంపికలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగంలో చదువుతున్న దివ్యశ్రీ ప్రతిభ కనబరిచి ఇంటర్ యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు వారు తెలిపారు. అదేవిధంగా నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న మిన్నుషైన్ బ్యాడ్మింటన్‌లో రాణించి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరిద్దరిని బుధవారం కళాశాల ఆవరణలో అభినందించారు. కళాశాల సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

న్యాయం చేయండి సారూ..

- 19 ఏళ్లుగా పని చేస్తున్నా కనీస కనికరం లేకుండా మాట్లాడుతున్నారు
- రిజిస్ట్రార్‌ను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు
- సీఎం చంద్రబాబుకు ద్రవిడ వర్సిటీ అటెండర్ ఫిర్యాదు



వర్సిటీ అధికారులపై ఫిర్యాదు చేసిన రఫీక్

కుప్పం: రోడ్డు ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో ఉన్న తనకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌ను కోరితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారంటూ ద్రవిడ వర్సిటీ ఉద్యోగి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన పట్ల యూనివర్సిటీ అధికారులకు సీఎం కార్యాలయం నుంచి అక్షింతలు పడినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాను..

ద్రవిడ వర్సిటీలో రఫీక్ అటెండర్‌గా గత 19 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే గత ఏడాది క్రితం పట్టణంలోని ఓ రోడ్డు ప్రమాదంలో కాలికి బలమైన గాయాలు కావడంతో నడవడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఇప్పటికే మూడు దఫాలు శస్త్రచికిత్సలు చేయించుకుని ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో తాను ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విధులు నిర్వహిస్తానని డిసెంబర్ 3వ తేదీ నుంచి వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌ను వేడుకుంటున్నాడు. అయితే వర్సిటీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతూ వచ్చారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు వస్తాయో లేదో తెలియదు.. ఉద్యోగం చేస్తే చెయ్.. లేకపోతే మానేయ్ అని ఘాటుగా సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. నామమాత్రపు జీతానికే గత 19 ఏళ్లుగా వర్సిటీలో విధులు నిర్వహిస్తున్నానని.. అయితే కనీసం నెల జీతాలు సైతం అందుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు.

వర్సిటీ అధికారులకు అక్షింతలు..

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం పట్ల అటెండర్ రఫీక్ బుధవారం సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు సంతానమని, వర్సిటీలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా కనీసం కుటుంబాన్ని కూడా పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపాడు. దీనికితోడు వర్సిటీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్నాడు. ఇప్పటికైనా తనకు తగిన న్యాయం చేయాలని కోరాడు. అటెండర్ విషయంలో చిన్నచూపు చూడడం పట్ల సీఎం కార్యాలయం నుంచి వర్సిటీ అధికారులకు లేఖతో పాటు అక్షింతలు కూడా పడినట్లు సమాచారం.

ఉలవ సాగు లాభదాయకం

- మండలంలో 400ఎకరాల్లో సాగు
- ప్రత్యామ్నాయ పంటగా ఉలవపంట
- పూర్తిగా వర్షాధార పంట
- ఉలవలతోపాటు పశుగ్రాసంగా పొట్టు, తీగలు
- తక్కువ సమయంలో పంట చేతికి
- తక్కువ ఖర్చుతో కలుపుతీయని పంట



కల్లూరులో సాగులో ఉన్న ఉలవ పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ప్రత్యామ్నాయ పంటగా రైతులు వర్షాకాలంలో ఏపంటనూ సాగు చేయని నేలల్లో ఉలవ పంటను సాగు చేస్తారు. అక్టోబర్ మాసంలో వేరుశనగ సాగు అనంతరం భూమిలో ఉలవలను చల్లుతారు. సాగు చేయని భూముల్లో కూడా అదే సమయంలో ఉలవ సాగు చేస్తారు. ఈపంట కేవలం మెట్ట ప్రాంతాల్లోనే సాగు చేస్తారు. ఈ పంటకు నీరు అవసరం లేదు. వర్షాల పైనే ఆధారపడి పంట దిగుబడి ఉంటుంది.

మండలంలో 400 ఎకరాల్లో సాగు..

పులిచెర్ల మండలంలో ఈఏడాది 400 ఎకరాల్లో ఉలవ పంటను రైతులు సాగు చేశారని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం పంటకు సకాలంలో వర్షాలు పడడంతో పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఉలవలు ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ.50 నుంచి రూ.60 పలుకుతోంది. ఉలవలతోపాటు తీగలు, పొట్టు పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. కూలి ఖర్చు తక్కువతో పాటు కలుపు తీయాల్సిన పనిలేదు. తక్కువ సమయంలో రైతులకు పంట చేతికొస్తుంది.

పశుగ్రాసంగా ఉలవ పొట్టు



రైతులకు ఉలవలతోపాటు ఉలవ తీగలు, పొట్టు పశుగ్రాసంగా ఉపయోగ పడుతుంది.ఎండాకాలంలో రైతులకు పశుగ్రాసం దొరకని సమయంలో ఈ తీగలను పొట్టును పశువులకు మేతగా వాడుకుంటారు. ఇది మంచి బలవర్ధకమైంది. –సి.వీరయ్య,రైతు,ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె

ఆరోగ్యానికి మంచిది



ఉలవలు ఆరోగ్యానికి ఎంతో మేలు. ఇతర పంటలతోపాటు ఇవి రైతులకు అదనపు ఆదాయం చేకూర్చుతాయి. కేవలం వర్షంతోనే ఈపంట చేతికొస్తుంది. తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో రైతులకు ఆదాయం తెచ్చే పంట. –సి.హరినాథ్, రైతు, మతుకువారిపల్లె

విద్యుత్ చౌర్యంపై తనిఖీలు తప్పనిసరి

- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు దాటితే బిల్లు
- అధికారులకు ట్రాన్స్‌కో సీజీఎం ఆదిశేషయ్య



మాట్లాడుతున్న సీజీఎం ఆదిశేషయ్య

చిత్తూరు కార్పొరేషన్: గ్రామాల్లో విద్యుత్ చౌర్యం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేసి జరిమానాలు విధించాలని ట్రాన్స్‌కో సీజీఎం ఆదిశేషయ్య ఆదేశించారు. బుధవారం అర్బన్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంస్థకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ సర్వీసులు 200 యూనిట్లు వరకు మాత్రమే విద్యుత్ ఉచితమన్నారు. ఆ పరిమితి దాటితే బిల్లు వసూలు చేయాల్సిందేనని, ఉదాశీనతగా వ్యవహరించరాదన్నారు. ఇటీవల పెండింగ్‌లో పడిన నైట్ రైడ్స్ కార్యక్రమాన్ని తిరిగి కొనసాగించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేసి అదనపులోడ్, చౌర్యం కేసుల ఉంటే జరిమానాలు వేయాలన్నారు. పనిచేయని విద్యుత్ మీటర్లను సకాలంలో మార్పు చేస్తుండాలన్నారు. వందశాతం కలెక్షన్ల వసూలుకు కృషిచేయాలన్నారు. ఫీడర్ల వారీగా విద్యుత్ ఎక్కడ లాస్ వస్తోందో గుర్తించి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. తరచూ లైన్ ఇన్‌స్పెక్టర్లు ట్రీ కటింగ్ పనులు చేయించాలన్నారు. డీపీఈ ఎస్ఈ శ్రీనివాస్‌బాబు, ఏఓ ప్రసన్నంజనేయులు, ఈఈ మునిచంద్ర పాల్గొన్నారు.